


# నీకోసం దాచిన పాట

**ఎగసిపడే అలల్లా కొన్ని జ్ఞాపకాలు జీవితాన్ని వెంటాడుతూ, వేధిస్తూ, వెలిగిస్తూ ఎదకనుమలలో తుపాను సృష్టిస్తుంటాయి. అదో గొప్ప వాతావరణం**

సముద్రం... తీరంతో ఏదో చెప్పాలని కెరటాల చేతుల్తో గొప్ప ఉద్వేగంతో, ఉత్సాహంతో, ఉరవడితో, ఉరుకులు పరుగులతో సాగివచ్చి, ఏమీ చెప్పలేని నిస్సహాయంతో వెనువెంటనే వెనక్కు తిరిగి వెళ్ళిపోతూ, వ్యక్తీకరించకుండానే మిగిలిపోయిన భావాల నడుమ హోరుహోరున దుఃఖిస్తూ, హోరున శబ్దించే ఆ దుఃఖమే లయబద్ధమైన సంగీతంలా, పాటలా పరివ్యాప్తమవుతూ...

* * *

అప్పటికి సూర్యుడి తొలి లేత కిరణమింకా సముద్రతరంగాల మీద ప్రసరించనే లేదు. సముద్ర తీరానికి ఎక్కడో దూరంగా ఉన్న భవంతుల నుంచి, వీధిదీపాల నుంచి మిణుకుమిణుగ్గా వస్తున్న విద్యుత్ కాంతి మినహా అంతా చీకటి చీకటిగా ఉంది.

అప్పటికే అక్కడికి చేరిన, ఇంకా చేరుకుంటున్న వేలాది జనంతో కన్యాకుమారి సముద్ర తీరమంతా పొద్దున్నే పక్షులు నిద్ర నుంచి లేస్తోన్న పచ్చని చెట్ల తోటలా కలకలంగా ఉంది. వణికిస్తోన్న చలి నుంచి తమను తాము రక్షించుకోవడానికి అందరూ స్వెట్టర్లు, శాలువాలు కప్పుకుని అక్కడికి చేరు కోవడంతో తీరం వెంట పెంగ్విన్ పక్షులు కొలువు తీరినట్టుగా కోలాహలంగా ఉంది.

అందరి హృదయాలూ మరి కొద్ది సేపట్లో ఒక మహాద్భుత రమణీయ దృశ్యాన్ని చూడబోతున్నా మన్న ఆనందోద్వేగాలతో నిండిపోయాయి.

రోజూ ఎవరి ఊళ్ళల్లో వాళ్ళు, ఎవరి ఇళ్ళ దగ్గర వాళ్ళు చూస్తోన్న సూర్యుడే కావొచ్చు. కానీ, ఇక్కడ-అప్పుడే ఊపిరి పోసుకునే పసిపాపలా సముద్ర గర్భంలోంచి పైకి లేచే సూర్యుడెలా ఉంటాడో చూద్దామన్న ఉత్సుకతతో అక్కడ చేరినవాళ్ళందరూ వయసులతో నిమిత్తం లేకుండా పసివాళ్ళైపోయారు.

"వినతా, ఇలా ఇక్కడ ఈ సమూహంలో ఒకళ్ళుగా కాదు, అదిగో ఆ ప్రహరీ దాటి సముద్రం లోపలికంటా మూడు నాలుగు పెద్ద పెద్ద రాళ్ళలాంటివి కనిపిస్తున్నాయి చూడు, వాటి మీదకి వెళదాం." భుజాలమీది శాలువాను దగ్గరగా లాక్కుంటూ పద్దెనిమిదేళ్ళ తన కోడలితో అన్నాడు జయశంకర్.

"అమ్మో, సముద్రం లోపలికే! నేన్రాను మావయ్యా. అంతగా కావాలంటే నువ్వెళ్ళు. నేనిక్కడే ఉండి నిన్నూ, ఆ సూర్యుణ్ణీ చూస్తూ, ఈ కెమేరాలో మిమ్మల్నిద్దర్నీ బంధించేస్తూ ఉంటాను."

జయశంకర్ పిల్ల కెరటపు నురుగులా చిన్నగా నవ్వి, కోడలి తల మీద అరచేయి వేసి, లాలనగా నిమిరి, "సరే, నీ ఇష్టం. తరువాత నువ్వే బాధ పడతావ్" అన్నాడు. జయశంకర్ సముద్రంకేసి చూశాడు. అంతా నల్లనల్లగా, చీకటిచీకటిగా, గుండె పగిలి పోతున్న చప్పుళ్ళతో ఒక నిరంతర శోక గీతంలా!

కాసేపటికి వెలుగొచ్చాక సముద్రమంతా నీలిరంగులోకి మారుతుంది.

సూర్యుడు ఉదయించబోయే దిక్కుకేసి చూశాడు. ఆకాశం కారుచీకటి రంగు నుంచి ఎరుపెక్కుతోంది.

ఆకాశమ్మీదా, సముద్రమ్మీదా పరుచుకున్న చీకటి పోతోంది. మరి, తన జీవితంలో పరుచుకున్న చీకటి పోతుందా?

జయశంకర్ నలభై అయిదేళ్ళ బ్రహ్మచారి. అక్కడక్కడా నెరిసిన వెంట్రుకలతో. ఒక మోస్తరు ఎత్తు, చక్కని శరీర ఛాయతో యూనిఫార్మ్‌లా ఎప్పుడూ ధరించే జీన్స్‌ప్యాంట్, ఖద్దరు లాల్చీతో జయశంకర్ అతి సామాన్యంగా ఉంటాడు. గత కొద్దికాలంగా పాటల్ని ప్రేమించేవాళ్ళకి అతడు 'ప్రేమ గీతాల జయశంకర్'గా సుపరిచితుడు. అయితే, అతడు తన జీవితంలోని వాడిపోయిన ప్రేమ పుష్పాలనే ఒకటొకటిగా తీసి గీతమాలికలలో కూరుస్తున్నాడని ఎంతమందికి తెలుసు?

కొత్త పాటలు కట్టడం కోసం ఇలా ఊళ్ళు తిరగడం, ఒక క్యాసెట్‌కి సరిపడా పాటలు తయారవగానే రికార్డింగ్ కోసం హైదరాబాద్ వెళ్ళడం ప్రస్తుతం జయశంకర్ జీవితంలో క్రమం తప్పకుండా జరుగుతున్నాయి.

"ఇంతకుముందు రెండుసార్లు కేవలం ఈ సూర్యోదయం చూడడం కోసమే ఇక్కడికొచ్చాను. వరుసగా నాలుగు రోజులు కాపలా కాసినా ఆకాశం నిండా మేఘాలు ముసురుకుని ఉండడంతో సముద్రం అట్టడుగు నుంచి సూర్యుడు ఉదయిస్తూ ఉండగా చూడాలన్న నా చిన్ననాటి ఆశ అట్లా తీరకుండానే ఉండిపోయింది. ఇవాళ ఆకాశం చాలా తేటగా ఉంది. వినతా, ఇక్కడ ఇంతమంది జనం మధ్యన కాకుండా అట్లా కొంచెం సముద్రంలోనికంటా వెళ్ళి సూర్యోదయం చూస్తే ఎంత అద్భుతంగా ఉంటుందో తెలుసా? ఇవాళ సూర్యుడు కేవలం మన ఒక్కరి కోసమే ఉదయిస్తున్నట్టు, బద్ధకంగా ఆవులిస్తూ సముద్రం పక్కమీంచి లేచి ముస్తాబై మస్తున్నట్టూ..." తన రెండు చేతులూ గుండ్రంగా తిప్పుతూ కోడలితో అన్నాడు జయశంకర్.

"అలాంటివన్నీ నీ పాటల్లో రాసుకో. చాలా బావుంటాయ్. నువ్వెన్ని చెప్పినా నేను మాత్రం లోపలికి వచ్చేది లేదు."


"సరే, నీ ఇష్టం" అని ముందుకు కదిలాడు.

తీరం దాటి, సముద్రం లోపలికంటా ఉన్న ఒక బండరాయి మీదకు చేరుకున్నాడు. సముద్ర కెరటాలు ఆ ప్రదేశాన్ని బలంగా తాకుతూ వెనక్కు వెళ్ళిపోతున్నాయి. కెరటాలు పాదాలను పట్టి లాక్కు పోకుండా తమాయించుకుని నిలబడ్డాడు. వెనుక నుంచి కొందరు తమిళంలోనూ, తెలుగులోనూ హెచ్చరిస్తూ గోలగోలగా అరుస్తున్నారు.

"అదిగో, అదిగో వచ్చేస్తున్నాడు." అప్పుడే సముద్రమ్మీద కొద్దిగా పైకి లేచిన సూర్యుణ్ణి చూసి జనం పట్టరాని ఆనందంతో అరుస్తున్నారు.

సముద్రంలోంచి ఆకాశమ్మీదకు కొద్దిగా ఎగబాకిన సూర్యుడి బింబం, సముద్రంలో ఆకాశం నుంచి భూమ్మీదకు వేయబడిన బంగారు బాటలా మనోహరంగా కనిపిస్తోంది. జయశంకర్ వంగి, లేత ఎరుపు సూర్యకాంతి తళతళా మెరుస్తోన్న నీళ్ళని

చిత్రాలు: నర్సిం



తన్మయంగా తాకాడు. సూర్యుడు సముద్రంలోంచి పైకి రాడనీ, అతడు రోదసిలోనే ఉంటాడనీ ఈ ఆధునిక సైన్సు యుగంలో తెలీని వాళ్ళెవరు? అయినా, సూర్యుడు సముద్రంలోంచి పైకి ఎగబాకు తున్నట్టుగా భ్రమ కల్పించే ఈ అపురూప సన్నివేశం కోసం జనం ఎందుకింతగా ఎగబడతారు? బహుశా, మనుషులు నిజాలకన్నా భ్రమలు సృష్టించే సౌందర్యాన్నే ఎక్కువగా ప్రేమిస్తారేమో!

ఒక కెరటం వడివడిగా జయశంకర్ నిలుచుండిన బండరాయి వద్దకు చేరి, నిలువెత్తుగా మారి, జల పాతంలా అతడి మీదకు దూకింది.

తీరమ్మీద ఉన్న జనం అందరూ హఠాత్తుగా జరిగిన ఆ సంఘటనకు ఒక్క క్షణం ఆశ్చర్యపోయి గోలగోలగా అరవడం ప్రారంభించారు. మావయ్యనే గమనిస్తూ ఉండిన వినతకు శరీరం అంతా ఒక్క క్షణంలో చల్లబడిపోయి నోట మాట రాలేదు.

"జయా!"

సమూహంలోంచి బిగ్గరగా వినిపించిన ఆ కేకకు, తనని సముద్రంలోకి లాక్కుపోతోన్న బలమైన కెరటాన్ని తట్టుకునేందుకు ఒక్కసారిగా ఒంట్లోకి ఏదో కొత్త శక్తి ప్రవేశించినట్లుగా నిలదొక్కుకుని, తీరం వైపు చూశాడు జయశంకర్.

దూరంగా, సమూహంలోంచి ఒక గాజుల చేయి జెండాలా రెపరెపలాడుతోంది.

'ఎవరు? ఎవరది? తననిలా పిలిచేవాళ్ళెవరు? రాగమంజరి కాదుగదా! ఇన్నేళ్ళ తరువాత రాగమంజరి ఇక్కడ? ఏమో, ఆ పిలుపు మాత్రం కచ్చితంగా రాగమంజరిదే.'

సూర్యోదయం కన్నా అపురూప సన్నివేశం చూడవలసినవాడిలా జయశంకర్ గబగబా బండరాయి దిగి సముద్రతీరంలో ఆత్రంగా వెదకడం ప్రారంభించాడు.

"జయా... ఇక్కడ... ఇక్కడ."

'అవును, రాగమంజరే. తన రాగమంజరే.'

ఏ రాగమంజరి కోసం తానింతకాలం పాటలే ప్రపంచంగా బతుకుతున్నాడో, ఏ రాగమంజరి జ్ఞాపకాల్ని మనసులోంచి తుడిచేసుకోలేక తాను బ్రహ్మచారిగా మిగిలిపోయాడో, ఏ రాగమంజరి తనతో రెండు మాటలు మాట్లాడితే ఇక ఆ రాత్రంతా వాటినే నెమరేసుకుంటూ అలా రామకృష్ణా బీచ్‌కి వెళ్ళి పాటలు పాడుకుంటూ గడిపేవాడో, ఆ రాగమంజరి!

అక్కడక్కడా నెరిసిన వెంట్రుకలు తప్ప పెద్దగా ఏమీ మారలేదు. కొత్తగా మొహమ్మీదికి కళ్ళద్దాలు వచ్చి చేరాయి. ఎలాంటివాళ్ళనయినా గౌరవించేలా

**ఆకాశం కారుచీకటి రంగు నుంచి ఎరుపెక్కుతోంది. ఆకాశమ్మీదా, సముద్రమ్మీదా పరుచుకున్న చీకటి పోతోంది. మరి, తన జీవితంలో పరచుకున్న చీకటి పోతుందా?**

చేసే అదే హుందాతనం మొహంలో. పక్కన ఓ పదిహేనేళ్ళ పాప ఉంది.

"బాగున్నారా? చాలా ఏళ్ళయింది మిమ్మల్ని చూసి. మీ పాటలు రెగ్యులర్‌గా వింటున్నాను. ముఖ్యంగా విఫల ప్రేమను మీ పాటల్లో ఎంత గొప్పగా పలికిస్తున్నారు?" ఆశ్చర్యంతో గడ్డకట్టుకు పోయిన జయశంకర్‌ని రాగమంజరి ముందుగా తానే పలకరించింది.

"మీకు, మీకు నేనింకా జ్ఞాపకం ఉన్నానా?" ఇంకా ఆశ్చర్యంలోంచి తేరుకోని జయశంకరే అడిగాడు.

"అదేంటలా అడుగుతున్నారు? మన వైజాగ్ ఆఫీసులో ఇప్పటికీ మీ పాటల్ని జ్ఞాపకం చేసుకుంటూ ఉంటాము. నాకయితే మీరు నాకోసం పాడి వినిపించే జేసుదాస్ పాట, *తేరీ తస్‌వీర్ కో సీనే సే లగా రఖా హై* మనసులో ప్రతిధ్వనిస్తు న్నట్లుగానే ఉంటుంది." రాగమంజరి చెప్పుకు పోతోంది.

'నిజమా? రాగమంజరికి తాను ఇంకా అంత బాగా జ్ఞాపకం ఉన్నాడా?'

ఇంతలో మావయ్యని వెతుక్కుంటూ వచ్చిన వినత అక్కడకు చేరింది.

"ఇది మా పాప సృజన. ఇంటర్ చదువుతోంది." తన చుట్టూ ఉన్న మనుషుల్నీ, వాళ్ళ సంభాషణల్ని పట్టించుకోకుండా అలా తదేకంగా సూర్యుడు ఉదయిస్తోన్నవైపే చూస్తోన్న అమ్మాయిని పరిచయం చేసింది రాగమంజరి.

"సృజన... ది క్రియేషన్! చాలా మంచిపేరు." రాగమంజరివైపు తిరిగి మెచ్చుకోలుగా అన్నాడు.

"థాంక్యూ. 'కన్యాకుమారిలో సూర్యోదయం చూపించు మమ్మీ' అని ఇది ఎప్పట్నుంచో గొడవ చేస్తోంది. ఆయనకేమో ఉదయం లేస్తే కంపెనీ, లాభాలు, నష్టాలు తప్ప మరో విషయానికి తీరిక దొరకదు. అందులోనూ నాన్నగారు పోయాక కంపెనీ పనుల్తో మరింత బిజీ అయిపోయారు. ఇక లాభం లేదని నేనే దీన్ని తీసుకుని వచ్చా. అవునింతకీ ఈ అమ్మాయి ఎవరు? మీ పాపా?" వినతని చూస్తూ అడిగింది రాగమంజరి.

"కాదు. మా చెల్లెలి కూతురు, వినత." ముక్తసరిగా చెప్పాడు.

"మరి మీ..." ప్రశ్నను సగంలోనే ఆపేసింది.

జవాబు ఏవిధంగా చెప్పాలో తెలియక రెండు చేతుల్నీ లాల్చీ జేబుల్లోకి జొనిపి, సూర్యుడు ఉదయిస్తున్న వైపు చూశాడు.

"లేదు. మావయ్యింకా పెళ్ళి చేసుకోలేదు. బహుశా చేసుకోడు." వినత సమాధానమిచ్చింది.

"ఔనా? నిజమా? ఎందుకిలా బ్రహ్మచారిగా మిగిలిపోవాలనే నిర్ణయం తీసుకున్నారు?" గొప్ప ఆశ్చర్యంతో అడిగింది రాగమంజరి.

'నీకోసమే. నిన్ను ఆరాధించిన మనసులోకి మరెవర్నీ రానివ్వడం ఇష్టం లేకే' అని చెప్పేస్తే రాగమంజరి ఎలా ప్రతిస్పందిస్తుంది? వద్దు వద్దు.

అప్పుడు చెప్పనిది, ఇన్నేళ్ళ తరువాత ఇప్పుడు చెప్పడమా?

"పాటలే ప్రపంచంగా బతికేవాడి జీవితంలోకి ఎవరో ఒక స్త్రీని ఆహ్వానించి ఇబ్బందులపాలు చేయగూడదనుకున్నాను. అంతకుమించి మరేం లేదు." నేల చూపులు చూస్తూ జవాబు చెప్పి, అటు తిరిగి ఉబికి ఉబికి వస్తోన్న కన్నీళ్ళని కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు.

"ఊహూ! నేన్నమ్మను. మీరు ఎవరో అమ్మాయిని గాఢంగా ప్రేమించి విఫలమయ్యారు. అసలు మీ పాటల్ని వింటున్నప్పుడే అనుకునేదాన్ని గానీ, ఇవాళెందుకో అది నిజమనిపిస్తోంది." జయశంకర్ కళ్ళలోకి తదేకంగా చూస్తూ అంది.

'రాగమంజరీ, నేను ప్రేమించింది నిన్నేనని ఇవేళ్టికీ గ్రహించలేకపోయావా?'

ఎలాంటి వివరణా ఇవ్వకుండా సన్నగా నవ్వాడు. బహుశా నవ్వినట్టు నటించాడు జయశంకర్. "ఎప్పటిదాకా ఉంటారిక్కడ?" టాపిక్ మారుస్తూ అడిగాడు.

"ఇవాళ లంచ్ చేసి, వైజాగ్‌కి బయల్దేరి వెళ్ళిపోవడమే. అన్నట్టు ఇవాళ మీరిద్దరూ మాతో కలిసి లంచ్ చేస్తున్నారు. అంతేకాదు, నా కోసం ఒకప్పుడు మీరు పాడి వినిపించే జేసుదాస్ పాట కూడా వినిపించాలి. తప్పకుండా వస్తారు కదూ!" తప్పదన్నట్టుగా అంది.

"మీరంతగా చెప్పాక రాకుండా ఉంటామా?"

రాగమంజరి తాము బసచేసిన హోటల్ గది వివరాలు వగైరా చెప్పి, పాపని తీసుకుని ముందుకు వెళ్ళిపోయింది.

దగ్ధమవుతోన్న అగ్నిగోళంలా సూర్యుడు ఇప్పుడు ఠీవిగా సముద్రపు అంచుల మీద నిలబడి ఉన్నాడు. ఒకవైపు వివేకానంద మెమోరీలరాక్, మరొకవైపు నుంచి కొన్ని పడవలు నీడల్లా కదిలి వెళుతున్నాయి. ఇందాక జయశంకర్ రాళ్ళమీదకి చేరినప్పుడు హెచ్చరిస్తూ హాహాకారాలు చేసినవాళ్ళలో కొందరు ఇప్పుడు సముద్రం లోపలికంటా ఉన్న రాళ్ళమీదకి చేరి ఫోటోలు దిగుతున్నారు.

జయశంకర్‌కి ఎందుకో ఇక సూర్యుణ్ణి చూడాలని పించలేదు. దూరంగా వెళ్ళి జనం పెద్దగా లేనిచోట ఇసుకలో దిగాలుగా కూర్చుండిపోయి, సముద్రాన్నే తదేకంగా చూస్తుండిపోయాడు.

'నీ ప్రవాహ తీరాన నిలిచి నిలువెల్లా పాటలు పూయాలని కలగన్నాను. పరదేశపు అతిథిలా వచ్చి వెళ్ళిపోయిన నదీ! ధన్యత కోల్పోయిన వెదురు పొదలా ఒంటరిగా మిగిలాను.'

* * *

"ఎవరు మావయ్యా ఆ రాగమంజరి? ఎందుకావిణ్ణి చూడగానే సూర్యోదయాన్ని దగ్గర్నుంచి చూడాలని చిన్నపిల్లాడిలా సముద్రంలోకి వెళ్ళినవాడివి కాస్తా తిరిగొచ్చేసి, మళ్ళీ సూర్యుడివంకే చూళ్ళేదు?" తాము బస చేసిన హోటల్ గదికి చేరుకున్నాక అడిగింది వినత.

'రాగమంజరి ఎవరంటే ఏమని చెప్పాలి ఈ అమ్మాయికి?'

"నువ్వెప్పుడూ అడుగుతూ ఉంటావే, మావయ్యా నువ్వెందుకిట్లా పెళ్ళి చేసుకోకుండా ఉండిపోయావని. ఇదిగో ఈ రాగమంజరిని... ఈ రాగమంజరిని ప్రేమించిన మనసులోకి మరెవర్నీ రానివ్వలేకే."

"అవునా! మరి ఆవిడ అలాంటిదేమీ తనకు తెలీనట్టుగా మాట్లాడుతోందేమిటీ?"

"నిజంగానే ఆవిడకు తెలీదు. ఎందుకంటే, ఆవిడకి నా మనసులోని మాట ఏ రోజూ చెప్పలేదు కాబట్టి."

"చాలా ఆశ్చర్యంగా ఉందే. ఇంత గొప్పగా ఆవిణ్ణి ప్రేమించి, నీ ప్రేమని వ్యక్తం చేయలేదంటే నమ్మలేకపోతున్నా. ఎందుకలా జరిగింది?"

"ఎందుకంటే, తాజ్‌మహల్‌ని మనం ఎంతయినా ప్రేమించొచ్చు. కానీ, తిరిగి తాజ్‌మహల్ మనల్ని ప్రేమించాలనుకోవడం దగ్గరే ఇబ్బందులు మొదలవుతాయి. నాది 'తొలిచూపు ప్రేమ' కాదుగానీ, రాగమంజరితో పరిచయం మెల్లమెల్లగా పెరుగుతున్నకొద్దీ ఆవిడ పట్ల ఇష్టం, ప్రేమ కూడా పెరగడం ప్రారంభమైంది.

ఇరవయ్యేళ్ళ క్రితం నేను వైజాగ్‌లోని ఒక చిన్న కంపెనీలో ఉద్యోగిగా చేరాను. అక్కడే నాతోపాటు రాగమంజరి పనిచేసేది. రాగమంజరి మా కంపెనీ యజమాని కూతురన్న విషయం నాకు కొద్దికాలం దాకా తెలీదు.

కంపెనీలో శ్రీనివాస్ అని నా క్లోజ్ ఫ్రెండ్ ఒకడు ఉండేవాడు. వాడెప్పుడూ అడిగేవాడు, 'ఎప్పుడూ ముభావంగా, మంచు శిలలా ఉండే ఆ అమ్మాయిని ఏం చూసి ప్రేమించావు? సరే, ప్రేమిస్తే ప్రేమించావు. కాస్త కులమూ వగైరా చూసుకుని ప్రేమించాల్సింది' అని. ఎందుకు ఇష్టపడలేదూ అంటే చెప్పగలనేమో కానీ, ఎందుకు ఇష్టపడ్డావూ అంటే ఏం చెబుతాను? పైగా ఎవర్నయినా ప్రేమించినప్పుడు కులమూ, గోత్రమూ చూసుకుంటే అప్పుడది ప్రేమెట్లా అవుతుంది?

ఒకసారి ఆఫీసులో చిన్న ఫంక్షన్ లాంటిది జరిగినప్పుడు ఇందాక ఆవిడ జ్ఞాపకం చేసిందే జేసుదాస్ పాట, అది పాడాను. ఆ సంఘటన తరువాత మా మధ్య అప్పటిదాకా ఉండిన పరిచయం గాఢమైన స్నేహంగా మారింది. ఒక్కరోజు రాగమంజరి కనిపించకపోయినా ఇక ఆ రోజంతా సర్వస్వం కోల్పోయినట్టుగా ఉండేది.

జయశంకర్‌కి ఇక సూర్యుణ్ణి చూడాలనిపించలేదు. దూరంగా వెళ్ళి జనం పెద్దగా లేనిచోట ఇసుకలో దిగాలుగా కూర్చుండిపోయి, సముద్రాన్నే తదేకంగా చూస్తుండిపోయాడు.

రాగమంజరి గొప్ప సంగీతప్రియురాలు. నా పాటల్ని రికార్డు చేసుకోవడం కోసం ఒకట్రెండు సార్లు నన్ను వాళ్ళింటికి తీసుకువెళ్ళింది. అప్పుడే తొలిసారిగా ఆఫీసులో పైకి అభ్యుదయం, ఆదర్శం అంటూ ఉపన్యాసాలిచ్చే రాగమంజరి నాన్నగారు, ఆ ఇంట్లోని మిగతా మనుషులూ ఎంత శుద్ధ సాంప్రదాయవాదులో, కులంలాంటి విషయాలలో ఎంత పట్టింపులో ఉంటారో అర్థమయింది. అలా రెండేళ్ళు గడిచాక, 'ఇలా ఈ మూగప్రేమ ఇంకెంతకాలం? రాగమంజరిని అడిగితే బాగుంటుంది. ఇంకా ఆలస్యం అవకముందే ఏదో ఒకటి తేలిపోతే మంచిది' అంటూ నా దగ్గరి స్నేహితులు ఒత్తిడి చేయడం ప్రారంభించారు.

తేలిపోతే మంచిదే. ఒకవేళ మునిగిపోతే? మళ్ళీ లేవగలనా?

అప్పటిదాకా ఏదో ఒకరోజున రాగమంజరిని అడగాల్సి వస్తుందన్న స్పృహ లేకుండా నిశ్శబ్దంగా ప్రేమిస్తున్న నాలో ఈ ప్రతిపాదనను గురించిన ఆలోచన ప్రవేశించగానే ఇక నాకు నిద్ర లేని రాత్రులు మొదలైనాయి.

ప్రేమ ప్రేమగానే ఉన్నంతకాలం ఏ బాధా ఉండదు. కానీ, ప్రేమని పెళ్ళిగా మార్చుకోవాలనుకున్నప్పుడు ప్రేమతో సంబంధం లేని డబ్బు, కులం, హోదా మొదలైనవన్నీ ఆ రెండింటి మధ్యా చేరి ప్రేమ పెళ్ళివైపు దారితీయకుండా కాపలా కాస్తాయి.

రాగమంజరి దృష్టిలో నేను మంచి స్నేహితుణ్ణి కావొచ్చు. కానీ, ఆమెలాంటి అందం, చదువు, డబ్బు ఉన్న అమ్మాయి తనకు భర్తగా వచ్చేవాడిలో ఆశించేవి నాలో ఏవున్నాయి? తనని నేను గొప్పగా ప్రేమించి ఉండొచ్చుగాక, ఒకవేళ ఆమె కూడా నన్ను, నేను తనని ప్రేమించిన స్థాయిలో ప్రేమిస్తే ఆ ప్రేమతో వీటన్నింటినీ మరపించగలనేమో కానీ రప్పించలేనుగదా! పైగా ఇంట్లోవాళ్ళ మాటని ఏమాత్రం జవదాటని అమ్మాయి నా ప్రతిపాదనకు అంగీకరిస్తుందా?

ఎటూ ఆశించిన ఫలితం రావడానికి అవకాశమే లేని ఆ వ్యర్థ ప్రతిపాదనని ఆమె ముందుంచి ఉన్న స్నేహాన్ని, అభిమానాన్నీ పోగొట్టుకోవడం నాకు ఇష్టం లేకపోయింది. ఆవిడ తిరిగి నన్ను ప్రేమిస్తుందన్న భరోసాలాంటిదేదీ లేకుండానే ప్రేమించడం ప్రారంభించాను. ఇక అక్కడే ఆగిపోవడం మంచిదనిపించింది.

దురదృష్టవశాత్తూ, నేనిలాంటి తర్జనభర్జనలో ఉన్న సమయంలోనే రాగమంజరి తన పెళ్ళి కార్డు ఇచ్చింది. ఇక ఆ తరువాత ఒక్క రోజు కూడా అక్కడ ఉండలేక, ఎవరికీ చెప్పకుండా ఉద్యోగం వదిలేసి హైదరాబాద్ చేరుకున్నాను. అప్పటి నుంచీ ఈ పాటలే నా ప్రపంచమైపోయాయి. రాగమంజరిని అంత గాఢంగా ప్రేమించిన మనసులో భార్య పేరుతో మరో అమ్మాయికి చోటివ్వలేక పెళ్ళి అనేదానిని నా జీవితంలోంచి తుడిచేశాను. ప్రేమికులు దీపం పురుగుల్లాంటివాళ్ళు. దహించబడతామని తెలిసినా దాని చుట్టూ ఇష్టంగా తిరుగుతూనే ఉంటారు.

ఒక చిత్రమైన విషయం చెప్పమంటావా వినతా?



రాగమంజరిని ఇంతగా ప్రేమించీ ఆమెకి దాన్ని తెలియజేయలేదే అన్న అసంతృప్తి మాత్రం నన్నెప్పటికీ వెంటాడుతూనే ఉంది." చెప్పడం ముగించి, కుర్చీలో కూర్చుని భారంగా కణతలు నొక్కుకున్నాడు జయశంకర్.

"నిజంగా నీకంత అసంతృప్తే ఉంటే, ఒక పని చేస్తే ఎలా ఉంటుంది మావయ్యా?" ఏదో ఆలోచన స్ఫురించినదానిలా అంది వినత.

"ఏమిటి?"

"ఇవాళ రాగమంజరి గారిచ్చే లంచ్‌కి నువ్వొక్కడివే వెళుతున్నావు. ఆవిడకెటూ పెళ్ళయిపోయి ఒక పాప కూడా ఉంది. చూస్తే సంస్కారిలా ఉంది. నీ ప్రేమని గురించి ఆవిడకి అంతా చెప్పు. నువ్విప్పుడేమీ ఆవిణ్ణి పెళ్ళి చేసుకొమ్మని అడగబోవడం లేదు. కేవలం నీ అసంతృప్తి నుంచి బయటపడడం కోసం, నీ మనసులోని భారాన్ని దింపేసుకోవడం కోసం చెబుతున్నావు. అర్థం చేసుకోగలదన్న నమ్మకం నాకుంది."

"ఇన్నేళ్ళ తరువాత ఇప్పుడు చెప్పడమా?" ఆశ్చర్యంగా అడిగాడు.

"అవునిప్పుడే. ఇందులో తప్పేముంది? నిజాయితీ నిండిన నీ ప్రేమని గురించి ఆవిడకి చెబుతున్నావు. అంతేగదా."

"అంతేనంటావా?" అనుమానంగా అడిగాడు.

"ముమ్మాటికీ అంతే. ఈసారిమాత్రం ఈ నిర్ణయానికి తిరుగులేదు. ఇవాళ రాగమంజరిగారికి ఒకప్పటి నీ ప్రేమని గురించి తెలియజేస్తున్నావు. అంతే!"

జయశంకర్ కూడా ఏదో నిర్ణయానికి వచ్చినవాడిలా అలా ఆలోచిస్తుండిపోయాడు.

* * *

"ఇంత ఆలస్యమైపోయిందేం మావయ్యా?" జయశంకర్ గదిలోకి అడుగు పెట్టీపెట్టగానే అడిగింది వినత.

"లంచ్ అయిపోయాక రాగమంజరిగారినీ, వాళ్ళ పాపనీ బస్సెక్కించి సెండాఫ్ ఇచ్చి వస్తున్నాను." నిర్లిప్తంగా బెడ్‌మీద వాలిపోయి పైకప్పులో తదేకంగా తిరుగుతోన్న గాలిపంకానే చూస్తూ బదులిచ్చాడు.

"నేనిక్కడ ఎంత టెన్షన్‌లో ఉన్నానో తెలుసా? నువ్వేమో నింపాదిగా వచ్చి, యోగిలా బెడ్‌మీద వాలిపోయావు. ఇంతకీ రాగమంజరిగారు ఏమన్నారు?" ఇక ఉద్వేగాన్ని ఆపుకోలేక అడిగింది.

"ఇన్నేళ్ళ తరువాత ఇప్పుడు ఆవిడకి నా ప్రేమ గురించి చెప్పడం నావల్ల కాలేదు వినతా." ఉబికుబికి వస్తోన్న కన్నీళ్ళని తుడుచుకునే ప్రయత్నం చేయకుండా అలా తదేకంగా శూన్యంలోకి చూస్తూ తిరిగి అన్నాడు. "ఇనేళ్ళ తరువాత గుండె అట్టడుగు పొరల్లో భద్రంగా, అపురూపంగా దాచుకున్న ప్రేమని బయటకు తీసి ఆమెకి చూపించాక, ఒకవేళ ఆమె 'ఈమాత్రం దానికేనా పెళ్ళి చేసుకోకుండా ఉండిపోయావు' అంటే నేను భరించగలనా? అలా కాకుండా, 'నేను నిన్ను ఎప్పుడూ కేవలం ఒక స్నేహితుడిగానే చూశాను. అనవసరంగా నా అభిమానాన్ని అపార్థం చేసుకున్నావు' అని తానంటే, 'ఆమె కూడా నన్ను ప్రేమించే ఉంటుంది' అనుకుంటూ ఇన్నాళ్ళుగా నా హృదయంలో గూడుకట్టుకున్న ఆశ ఏమైపోతుంది? ఆ ఆశే ఆరిపోతే పాటలు పాడే ఈ గొంతు శాశ్వతంగా మూగబోతుంది. వద్దు, వద్దు... ఎవరితోనూ ఏమీ చెప్పొద్దు. చచ్చేంతవరకూ నన్ను ఆ ఆశతో బతకనీ." అరచేతుల్లో మొహాన్ని దాచుకుని చిన్నపిల్లాడిలా వెక్కివెక్కి ఏడుస్తోన్న మావయ్యని వినత అలాగే మౌనంగా చూస్తుండిపోయింది.

దూరంగా సముద్రం తన కెరటాల చేతుల్తో తీరంవైపు పరుగులు తీస్తూ వెనక్కి తిరిగి వచ్చేస్తూ... మళ్ళీ పరుగులు తీస్తూ... ■

# అస్తి నాస్తి విచికిత్సకు అద్దం

## స్మృతి సాహిత్యంలోని తీపిని, వేదనను రుచిచూపించే పుస్తకం



**తెలుగులో స్మృతిసాహిత్యం - భరద్వాజ రచనలు**
రచన: డా. వై.ఎ. విశాలక్ష్మి
ప్రతులకు: రవిశంకర్, 12-2-417/17, శారదానగర్, హైదరాబాద్-500 267
పేజీలు: 215;
వెల: రూ. 100/-

మల్లంపల్లి ధూర్జటి

ఈ పుస్తకం గురించి చెప్పుకునే ముందు దాని రచయిత డాక్టర్ వై.ఎ. విశాలక్ష్మి గురించి ముందుగా కొన్ని మాటలు చెప్పుకోవలసి ఉంది. హిమాలయాలలోని మారు మూల కుగ్రామం మాల్పాలో ఈ ఏడాది ఆగస్టు 18వ తేదీ అర్ధరాత్రి కొండచరియలు విరిగిపడ్డాయి. గంటకు 100 మైళ్ళ వేగంతో కొండలపై నుంచి దొర్లుకుంటూ వచ్చిన రాళ్ళు, మట్టి, బురదల కింద పడి మానససరోవరం సందర్శనకు బయలుదేరిన 200 మంది శాశ్వతంగా సజీవ సమాధి అయిపోయారు. మరికొంత మంది అక్కడున్న కాళీ నదీ ప్రవాహంలో కొట్టుకుపోయారు. ఈ దుర్ఘటనకు బలైన తెలుగు వారిలో విశాలక్ష్మి దంపతులు కూడా ఉన్నారు. ఆమె హైదరాబాద్‌లో టెలిఫోన్ శాఖలో పనిచేశారు. ఆమెకు తెలుగు సాహిత్యాభిమానం మెండు. ఆ అభిమానమే ఆమెను ఈ పరిశోధనకు పురికొల్పింది. కానీ, ఆమె తన పరిశోధన ఫలితం పిహెచ్.డి డిగ్రీని చూసుకోకుండానే ఈ లోకం విడిచి వెళ్ళిపోవలసి వచ్చింది. మృత్యువు తీరే అంత. అది ఎప్పుడు ఎవరిని కబళిస్తుందో చెప్పలేం. కాక తాళీయంగా విశాలక్ష్మి తన పరిశోధనకు స్మృతి సాహిత్యాన్ని ఎంచుకున్నారు. పరిశోధనలో ఆమెకు ప్రొఫెసర్ ఎస్. గోపి మార్గదర్శిగా వ్యవహరించారు. దాని ఫలితమే తెలుగులో స్మృతిసాహిత్యం - భరద్వాజ రచనలు అన్న ఈ సిద్ధాంత వ్యాస పుస్తకం.

> ఎండ దుమ్మును వెన్నెల స్నానంతో కడుక్కుంటున్నాయి చెట్లు, కొండలు, పొలాలు. నక్షత్రాల మినుకు కాంతుల కింద మబ్బుల జోలపాటలు వింటూ నిదురపోయిన ప్రకృతి మెల్లగా మేలుకొంటున్నది ఈ ఉదయాన. -పుట: 148

మానవ జీవితంలో మృత్యువు అత్యంత విషాద భరితమైంది. ఇది మనుషులను శాశ్వతంగా దూరం చేస్తుంది. మృత్యువు అనివార్యం అని తెలిసున్నా అది మన గుండెల్లో గుబులు రేపుతూనే ఉంటుంది. అది చేసిన గాయాన్ని మాన్పే శక్తి ఒక్క కాలానికే ఉంది. ఒక్కోసారి కాలం కూడా ఆ గాయాన్ని పూర్తిగా మాన్పలేకపోవచ్చు. మృత్యువు కలిగించిన విషాదం నుంచి ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా ఉపశమనం పొందుతూ ఉంటారు. చనిపోయిన వారితో మనకున్న అనుబంధం గాఢతను బట్టి అది మారుతూ ఉంటుంది.

మృత్యువు కలిగించే విషాదానుభవం ఎవరికైనా ఒకటే. అందుకనే ప్రసిద్ధ వ్యక్తులపై రాసిన స్మృతిగీతాలే కాదు కొందరు తమ రక్తసంబంధీకులు, మిత్రుల పట్ల రాసుకున్న స్మృతిగీతాలు కూడా మనల్ని ఆకట్టుకుంటాయి, కదలిస్తాయి. నాయని సుబ్బారావు తమ కుమారుడు మోహనరావు స్మృతి సూచకంగా రాసుకున్న విషాదమోహనం కావ్యం అందుకనే మన కంటతడి పెట్టిస్తుంది. పోయినోళ్ళందరూ మంచోళ్ళు, ఉన్నోళ్ళు పోయినోళ్ళ తీపిగురుతులు అన్నాడు ఆత్రేయ. నిజానికి, పోయినోళ్ళు కూడా ఉన్నోళ్ళకి తీపిగురుతులే. తమ తల్లి విశాలక్ష్మి తీపిగుర్తుగా ఆమె కుమారులు రవిశంకర్, శ్రీనివాస్‌లు ఈ పుస్తకాన్ని తీసుకువచ్చారు.

చనిపోయిన వారిని స్మరించుకున్నప్పుడు వారు నిత్యం చేస్తూ వచ్చిన పనులు, వారితో మనకున్న అనుబంధం గుర్తుకువస్తాయి. సామర్థ్యం ఉన్న వారు తమ బాధను సాహిత్య రూపంలో వ్యక్తీకరిస్తారు. అది గద్యం, పద్యం, గేయం వగైరా ఏమైనా కావచ్చు. దీనినే స్మృతి సాహిత్యం అని పిలుస్తున్నారు. మిగిలిన భాషలలో మాదిరిగానే తెలుగులోనూ స్మృతి సాహిత్యం గణనీయంగా ఉంది.

విశాలక్ష్మి స్మృతిగీతాలను అయిదు రకాలుగా విభజించారు. అవి దేశ నాయక స్మృతి, మహాపురుష స్మృతి, రక్తబంధు స్మృతి, మిత్ర స్మృతి, సతీ స్మృతి. సంస్కృతాంధ్రాంగ్ల భాషల్లో స్మృతి సాహిత్యం పుట్టు పూర్వోత్తరాలను ఆమె ఈ పుస్తకంలో సాకల్యంగా వివరించారు. రావూరి భరద్వాజ తన భార్య కాంతం మృతికి విలపిస్తూ రాసిన స్మృతి రచనలను ఆమె ఇందులో ప్రధానంగా విశ్లేషించారు. కాంతం మరణం భరద్వాజను కుదిపేసింది. అంతరంగంలో ఆలోచనలను రేకెత్తించింది. తాత్త్వికునిగా మార్చింది. దాని ఫలితంగా ఉద్భవించినవే నాలోని నీవు, *అంతరంగిణి*, *ఐతరేయం*, *అయినా ఒక ఏకాంతం*, *ఒకింత వేకువ కోసం* అనే పుస్తకాలు. భరద్వాజ భావుకతకు, అభివ్యక్తికి, ఆర్ద్రతకు చక్కని నిదర్శనాలీ పుస్తకాలు. *నేనో వాన చినుకుగా మారి నీ చిన్నారి పెదవుల మీద వాలిపోదామనుకుంటున్నాను. నేనో వెన్నెల కిరణంగా మారి నీ చెక్కిలిమీంచి జారిపోదామనుకుంటున్నాను. నేనో పరిమళతరంగాన్నయి నిన్ను నిలువునా ఆవరించుకుందామనుకుంటున్నాను.* ఐతరేయంలోని ఈ వాక్యాలు భరద్వాజ గద్యం కూడా వచన కవితలా జలజల పారే సెలయేరులా ఉంటుందనడానికి తార్కాణాలు. వాటిని ఇంతవరకు చదువని వారు ఈ సిద్ధాంత వ్యాసాన్ని చదివిన తరువాతనైనా చదవాలనుకుంటారు.

విశ్వ సాహిత్యంలో స్మృతిసాహిత్య పరిచయం, తెలుగులో స్మృతిసాహిత్యం, తెలుగులో డైరీ ప్రక్రియ, భరద్వాజ స్మృతిరచనలు-పరిశీలన, భరద్వాజ వ్యక్తిత్వంలో భావపరిణామం పేరిట ఈ పుస్తకంలో అయిదు అధ్యాయాలున్నాయి. సందర్భానుసారంగా స్మృతి గీతాలను ఉటంకించారు. భరద్వాజ జీవిత రేఖలు, భరద్వాజ సాహితీ జీవితాన్ని అనుబంధంగా చేర్చారు. ఈ పుస్తకం మనం కోల్పోయిన వ్యక్తులను గుర్తు చేయడమే కాదు, వారు లేకపోయినా వారి తీపి గురుతులను తలచుకుంటూ జీవించే దిటవుని కూడా ఇస్తుంది. ■